శాక్రమెంటో తెలుగు సంఘం ఆధ్వర్యంలో

శ్రీ యుఏయన్ మూర్తి స్మారక 3వ రచనలపోటీ

# సంబరాల సంక్రాంతి

ముందురోజంతా ప్రయాణంతో అలసిపోయినా మిథున, రిత్విక్‌లకి ఆ ఉదయం త్వరగానే మెలకువ వచ్చేసింది. చుట్టూ అలవాటులేని వాతావరణం. తమ అపార్టుమెంటులో నిద్ర లేవడానికి ఇక్కడ తాతయ్య ఇంట్లో లేవడానికీ తేడా స్పష్టంగా కనిపిస్తోంది

వాహనాల హోరన్లు వినబడని ఏదో ప్రశాంతత ...పెరటిలో ఆవు అంబారవం...పక్షుల కిలకిలలు...

ఆ ప్రభాత ప్రశాంత వాతావరణాన్ని ఆస్వాదిస్తూ చిత్రంగా కళ్లు నులుముకుంటూ పెరట్లోకి వెళ్లగానే బామ్మ సుభద్ర నల్లని నీళ్లకాగులో ఇటికెల పొయ్యిమీద కొబ్బరిమట్టలతో నీళ్లు కాస్తోంది.

దూరంగా గుళ్లోంచి తిరుప్పావై వినిపిస్తుంటే లేవగానే కొబ్బరిచెట్టుకిందకి చేరి రాత్రి గాలికి రాలిన చిన్నిచిన్ని కొబ్బరిపువ్వులను అపురూపంగా చూస్తున్నాడు రిత్విక్. సపోటా చెట్టు మీదికి చిలకలు చేరాయేమో తెగ గోల చేస్తున్నాయి.

శాలువా కప్పుకుని మిథున గుమ్మం ముందు ముగ్గులేస్తున్న పద్దెనిమిదేళ్ల పెదనాన్న కూతురు సంగీత అక్కయ్య దగ్గరకు చేరిపోయింది.

చలి వణికిస్తున్నా నరసింహ శతకంలో పద్యం చదువుతూ షణ్ముఖశర్మ బావి దగ్గర నీళ్లు తోడుకుని స్నానం చేస్తున్నాడు.

**మృగజాతికెవ్వడు మేతబెట్టె- వనచరాదులకు భోజన మెవ్వడిప్పించె?-చెట్లకెవ్వడు నీళ్లు చేది పోసె?-**

**స్త్రీల గర్భంబున శిశువు నెవ్వడు పెంచె-ఫణుల కెవ్వడు పోసె బరగ పాలు?-**

**మధుపాళి కెవ్వడు మకరందమెనరించె?-పశుల కెవ్వడొసంగె పచ్చిపూరి?**

**జీవకోట్లను పోషింప నీవెగాని-వేరెయొకదాత లేడయ్య వెదకి చూడ!**

**భూషణవికాస!శ్రీధర్మపుర నివాస!దుష్ట సంహార! నరసింహ! దురిత దూర!**

రిత్విక్ వణుకుతూనే బావి దగ్గరకు చేరాడు.'తాతయ్యా అప్పుడే బావిదగ్గర స్నానంకూడా చేసేస్తున్నావే చలెయ్యదా?'

నాలుగేళ్ల తర్వాత మనవలు పండక్కి వారంరోజుల ముందే రావడం కాదుగానీ ఇప్పుడే సంక్రాంతి వచ్చేసినట్టుంది షణ్ముఖశర్మకీ సుభద్రమ్మకీను.అందుకే విచ్చుకున్న ముఖంతో అన్నారు ఆయన.

'బావినీళ్లు వెచ్చగా ఉంటాయిరా. సూర్యోదయం కాకుండా సముద్రంలోగాని నదిలోగాని చెరువులోగాని చేసే స్నానం శరీరంమీది కల్మషాలను హరించడమేకాకుండా మనసుకి కూడా ఒకవిధమైన శక్తినిచ్చి బుద్ధికి పదును పెడుతుందిరా చిన్నా. రాత్రంతా చంద్ర కిరణాలు సోకిన నీటికి విశిష్టమైన శక్తి వుంటుంది.'

'అయితే నేను కూడా చేస్తా తాతయ్యా.' చొక్కా విప్పి వచ్చాడు రిత్విక్.

'పట్నం మనవలుకదా మీరిద్దరూ బామ్మకి అపురూపం.అదిగో కాగుతో వేడినీళ్లు కాచింది.పద పోసుకుందువుగానీ... '

ఊహూ!ఇక్కడున్నన్నాళ్లూ... నీతోబాటే బావి దగ్గర చేస్తా.'

'నా బంగారు తండ్రే... ' ముందు పళ్లు తోమించి తర్వాత మనవడిమీద నీళ్లు తోడి పోసారు తాతగారు.

రిత్విక్ గంతులేసాడు.'తాతయ్యా...ఇప్పుడు అసలు చలే లేదు.ఎంత బావుందో...ఇంకా పొయ్యి తాతయ్యా!'

అప్పుడే వీథిలో సంగీతక్కతోపాటు తక్కిన కన్నెపిల్లలు పోటాపోటీగా వేసిన ముగ్గుల్ని ఆసక్తిగా చూసి లోపలికొచ్చింది మిథున.

'బంగారూ, నువ్వూ స్నానం చేసేస్తే అలా సరదాగా నడుచుకుంటూ గుడికెళ్లొద్దాం.ఇదిగో సుభద్రా! నువ్వూ వస్తున్నావా?'

'గుడికి అంటే రాకుండా ఎలా ఉంటాను చెప్పండి.పైగా మనవలు వచ్చాక అభిషేకం చేయిద్దామనుకున్నామాయె.కాని సంగీత ఒక్కత్తీ ఎలా వుంటుందా అని ఆలోచిస్తున్నానండీ! 'అంది సుభద్ర గుంజాటన పడుతున్నట్టుగా.

సంగీత చెప్పింది.'ఏంపరవాలేదు.నువ్వెళ్లిరా బామ్మా ...పనమ్మాయి బట్టలుతుకుతూ నాకు సాయంగా ఉంటుందిగా... రాకరాక వచ్చారు. బాబాయి పిల్లలికి అన్నీ చూపించండి.'

రిత్విక్ బామ్మ కొంగు పట్టుకున్నాడు.' బామ్మా! ఇవాళ తెల్లారగట్ల ఈ ఊళ్లో ఏదైనా ఫంక్షన్ జరిగిందా?పొద్దుటే సుస్సూకి వెళ్లడానికి లేచినప్పుడు నాకు ఏవో భజన పాటల్లాంటివి వినిపించాయి.'

మిథున తాతగారి దగ్గరకు చేరింది.'అవును తాతయ్యా ! వాళ్లంతా గుంపుగా పాడుతున్నారు.'

సుభద్రకి మనవలు వచ్చిందగ్గర్నుంచీ ఆసక్తిగా ప్రశ్నలు వేస్తూంటే మహా ముచ్చటగా ఉంది.

' ఇవి సంక్రాంతిరోజులుకదా. పల్లెల్లో రైతులు ధనుర్మాసంలో ఇలా తెల్లారుజామునే లేచి కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేసి భజన గీతాలు పాడుతూ గ్రామ ప్రదక్షిణలు చేయడం మన తెలుగువాళ్ల ఆచారమర్రా. దీన్నే గ్రామ సంకీర్తనం అంటాం తల్లీ!'

'కానీ అలా అంత తెల్లారకుండానే ఊరంతా తిరగడం ఎందుకు తాతయ్యా...?'

భర్త మనవలికి చెప్పేందుకు సన్నద్ధమవుతున్నాడని అర్ధమైన సుభద్ర మనసు భూతకాలంలోకి వెళ్లిందోక్షణం. పెద్దకొడుకు సుధాకర్ చిన్నాడు మధు, కూతురు లక్ష్మి కూడా అంతే. స్కూలునుంచి రాగానే తన మావగారి చుట్టూ చేరిపోయేవారు.

తాతగారి మాటలను చెవులు నిక్కించి మరీ వింటున్నారు మిథున, రిత్విక్.

'మన ఆచారాల్లోను, సంప్రదాయాల్లోను అంతర్గతంగా తప్పకుండా ఏదో ఒక విశేషార్థం ఉంటుందిరా చిన్నా! ఇది చలికాలం కాబట్టి, రైతులు దుప్పటి కప్పుకుని మూలన ముడుచుకుని పడుకుంటే కోసి కుప్ప వేసిన పంట లక్ష్మిని, కోత కొచ్చిన సిరిని దొంగలు దోచుకుపోయే ప్రమాదముంది కనుక రాత్రంతా చేలల్లో చలిమంటలు వేసుకుని వెచ్చగా కూర్చుని జంతువులు అవీ రాకుండా కబుర్లు చెప్పుకుంటూ పంటను కాపలా కాసే విధానం అని మా పెద్దలు చెప్పేవారు.'

సుభద్రవంత పాడింది.' ఇంక ఎలాగూ తెల్లవార్లూ కాపలా కాస్తారు కనుక పొద్దుటే పాటలు పాడుతూ దైవనామస్మరణ చేస్తే పుణ్యం పురుషార్ధమూ కలిసొస్తాయి కదా....అందుకే అలా తిరుగుతారు.'

'మాకు హిమాచలప్రదేశ్‌లో చలికదా బామ్మా. సెలవు అయినా ఎక్కడికీ వెళ్లడానికే వీలుండదు. అందుకే ఏ పండగా తెలియదు. తాతయ్యా ! మరి సంక్రాంతి పండగకి ఇక్కడ పల్లెల్లో ఏంచేస్తారు?' అడిగాడు రిత్విక్.

' మనవడడుగుతూంటే అలా బెల్లం కొట్టిన రాయిలా మాట్లాడరేం?'

'ఏదీ నువ్వు నన్ను చెప్పనిస్తేకదా సుభద్రా!'

పిల్లలిద్దరూ కిలకిలా నవ్వారు. 'అచ్చం మా అమ్మా నాన్నా కూడా ఇలాగే అనుకుంటారు బామ్మా...'

'ఏదో అలా అలవాటయిపోయిందర్రా మాకు.' సిగ్గుతో ఎర్రబడిన భార్యముఖాప్పి చూసి నవ్వాడు షణ్ముఖశర్మ.

'ఇదిగో సంక్రాంతి అంటే మూడు రోజుల ముచ్చటైన పండగర్రా... భోగివరకు సూర్యుడు మకరంలో ప్రవేశించేవరకు ధనూరాశిలో ఉంటాడు కనుక ధనుర్మాసం. పూర్వం విష్ణుచిత్తుడు అనే పూజారి భక్తుడి కూతురు గోదాదేవి విష్ణుమూర్తిని భర్తగా పొందడం కోసం నెలరోజులపాటు తిరుప్పావై పాడుతూ ఈ ధనుర్మాస వ్రతాన్ని చేస్తుంది. చివరికి అది ఫలించి ఆయన్ని పెళ్లాడుతుంది. అందుకే ధనుర్మాసం చివరి రోజున అంటే సంక్రాంతినాడు విష్ణు ఆలయాల్లో గోదాదేవికి కల్యాణం చేస్తామన్నమాట.'

రిత్విక్ ఊరుకోలేదు.' మూడురోజులుపండగ అన్నావు కదా తాతయ్యా? '

'అవును చిన్నా. మొదటి రోజు భోగి...ఆరోజు తెల్లారగట్ల గ్రామంలో భోగిమంటలు వేసి పాత వస్తువులను దహనం చేస్తారు.'

మిథున ఉత్సాహపడింది.'ఎందుకో నేను చెప్పనా? ఇంట్లో విరిగిపోయినవి, పాతవి వస్తువులన్నీ పోయి ఇల్లు శుభ్రపడు తుందన్నమాట. అంతేగా బామ్మా?'

సుభద్ర మనవరాలి తెలివి తేటలకు మురిసిపోయింది.' చక్కగా చెప్పావుతల్లీ. భోగిరోజున తెల్లారగట్లే ఒంటినిండా నువ్వుల నూనె రాసుకుని చక్కగా నలుగు పెట్టి, కుంకుడు కాయలతో స్నానం చేసి వచ్చి మంటల్లో భోగి దండలు వేసి చలి కాచుకుంటాం. నువ్వులతో చేసిన పిండివంటలు, గుమ్మడి కాయని కూరగాగాని , పులుసుగా గాని తప్పనిసరిగా వండుకు తింటాం. ఎందుకో తెలుసా?

తడుముకోకుండా చెప్పాడు రిత్విక్. 'చలికాలం కదా...అవి ఒంటికి వేడినిస్తాయేమో. కరక్టేనా?'

'నా బంగారే...నువ్వు చెప్పడం అది తప్పవడమూనా?'

'తాతయ్యా సంగీతక్కయ్య మనింటిముందు రంగులతో ఎంత పెద్ద ముగ్గు వేసిందో? ఇదిగో వీథిలో అందరి ఇళ్లముందు రకరకాల ముగ్గులు కళ్లు చెదిరిపోతున్నాయి. ఎన్ని డిజైన్లో చూడు?'

'ముగ్గులలోకూడా రకాలున్నాయి గమనిస్తున్నారా? త్రిమూర్తులకు గుర్తుగా ఇళ్లముందు కూడా పండగ మూడ్రోజులూ సమబాహు త్రిభుజాకారపు ముగ్గు విష్ణుమూర్తికీ, లతాకారపు ముగ్గు శివుడికి, పరస్పర ఖండనాలయిన త్రిభుజాకారపు ముగ్గు బ్రహ్మదేవుడికీ సంకేతాలుగా పెడతారు.'

'అంటే ముగ్గుల్లోకూడా మా లెక్కలుంటాయన్నమాట.' అన్నాడు రిత్విక్ దీక్షగా చూస్తూ.

'ముగ్గులు కలపడానికి ముందు చుక్కలు కూడా లెక్కకు సరిపోతేనే ముగ్గు అందంగా సరిగ్గా వస్తుంది. తెలుసా? అంతేనా? భోగినాటి సాయంత్రం పసివాళ్లకి చీడ పోవడం కోసం నెత్తిన రేగుపళ్లు చెరుకు ముక్కలు, చిల్లర డబ్బులు,అక్షతలు కలిపి భోగి పళ్లు పోస్తామర్రా.'

'మరి మాకూ పొయ్యవా బామ్మా!" ఆశగా అడిగాడు రిత్విక్.

'ఎందుకు పొయ్యదూ...మీరూ చిన్న పిల్లలేగా...అందుకని మీ బామ్మ మీ ఇద్దరికీ, అత్త మావయ్యగారు కూడా వస్తారుకదా వాళ్ల చింటూకి, ముత్తయిదువలతో కలిసి భోగిపళ్లు పోస్తుంది లెండి.ఇంక రెండోరోజు పెద్ద పండగ...మకరసంక్రాంతి అంటే దానాలకు ప్రసిద్ధి.సూర్యుడిని మకర సంక్రమణంనాడు ఆరాధిస్తే పితృదేవతలనారాధించినట్టవుతుందని ఆరోజు వాళ్లకి తర్పణాలు విడుస్తారు.'

సుభద్ర అందుకుంది.' పొంగలి, చక్ర పొంగలి చేసుకుందాం.సరేనా?స్వార్థంతో కేవలం మనం ఒక్కళ్లమే కాకుండా అందరికీ వాత నివారణ అయి ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలని ఆరోజు నువ్వులు, సజ్జలు, గుమ్మడికాయలు, బెల్లం విశేషంగా దానాలు చేస్తాం.అంటే సర్వేజనా సుఖినో భవన్తు అన్నమాట. ఇంక ఆడవాళ్లు సుమంగళీత్వం కోసం పసుపు కుంకుమ, సుగంధ ద్రవ్యాలు,కాటుక అద్దం, దువ్వెన, పువ్వులు, బట్టలు పంచిపెట్టు కుంటాం.అంతేకాదు సంక్రాంతిరోజు సాయంకాలం బొమ్మల కొలువు పెట్టి పేరంటాళ్లను పిలుచుకుని వాళ్లకు పసుపురాసి గంధం రాసి, అరటిపళ్లు సెనగలతో తాంబూలాలిచ్చుకుంటాం.'

రిత్విక్ ఉత్సాహంగా అన్నాడు.' నాన్న ఢిల్లీలో ఉద్యోగం చేసినపుడు మేంకూడా ఓ బొమ్మల కొలువుకెళ్లాం బామ్మా...కదక్కా?'

'అవును తమ్ముడూ!అలా ఎందుకు చేస్తారో నేను చెప్పనా బామ్మా?చుట్టు పక్కల వాళ్లతో స్నేహం పెరుగుతుందటగా.'

'నాబంగారే...మనిషి సంఘజీవి కదా...పరోపకారం చేస్తూ నలుగురినీ కలుపుకుంటూ ఆనందంగా జీవించాలి అనేదే మన పండగల్లో అంతరార్థం. ఇంక మూడవరోజు కనుమునాడు ఏంచేస్తామోతెలుసా?ఇది పశువుల పండగ.'

తాతగారు మెచ్చుకుంటే భలే ఆనందంగా ఉంది పిల్లలకి.'పశువులకీ పండగలుంటాయా తాతయ్యా...'

శర్మ భక్తిగా కళ్లు మూసుకున్నాడు.'గోవు అంటే సామాన్యమైందికాదు నాయనా.. మనకి ఎంతో పవిత్రమైంది. ఎందుకంటే.. **గ్రీవా మస్తక సంధేతు తాసాం గంగా ప్రతిష్ఠితా!సర్వదేవ మయోగాన్త సర్వతీర్థమయాస్తదా!** అన్నారు మన పెద్దలు.అంటే గోవుయొక్క కంఠానికీ తలకీ మధ్య (గంగడోలు)గంగ ఉంది గోవుయొక్క సమస్త అవయవాలయందు సర్వ దేవతలు తీర్థాలు ఉన్నాయని అర్థం.'

'ఈశ్లోకం చాలాబావుంది. అర్థంతోబాటు నాకు నేర్పిస్తావుకదూ తాతయ్యా!'

'తల్లి తర్వాత తల్లి అంతటిది గోవు నాయనా. అందుకే అవి రైతులకు సాయంచేస్తూ మన గాదెలు నింపడానికి అలుపుసొలుపు లేకుండా సాయం చేస్తాయి.అందుకు కృతజ్ఞతగా ఈ పండగనాడు వాటికి స్నానం చేయించి పూలదండలు, చిరుగంటలు, కొమ్ములకు రంగులు వేసి, పసుపు కుంకుమలతో, పువ్వులతో అలంకరించి పూజ చేస్తాం. ఆవు కడుపులో అర్ధశేరు బంగారం ఉంటుంది అని నానుడి ఉందిలెండి.అంటే...ఆవు అంత బంగారాన్ని కొనగలిగేంత సంతతిని వృద్ధి చేసి పాలు, వెన్న నెయ్యి ఇస్తూ పాల కోసం పెయ్యలను, నాగలికోసం కోడె దూడలను ప్రసాదించే గోమాతకు కొత్త బియ్యంతో వండిన పొంగలిని తినిపిస్తాం.ఆరోజు సాయంకాలాలు సరదాగా ఊళ్లో కొన్నిచోట్ల, ఎడ్ల పందాలు, గొర్రె పొట్టేళ్ల పందాలు, కోడి పందాలు జరుగుతాయి.పశువుల ఊరేగింపులు జరుపుతాం.'

మిథున గొంతులో ఆనందం.'అయితే బామ్మా...మేం మంచి సమయానికే ఇక్కడికి వచ్చామన్నమాట.'

'అవున్రా...సంక్రాంతినాళ్లలో ముద్దబంతుల్లాంటి కన్నె పిల్లల సందడి చూసి తీరాలి. గడపలకు పసుపురాసి, గుమ్మాలకు బంతి తోరణాలు కట్టి వాకిళ్లలో ముత్యాల ముగ్గులు పెట్టి గొబ్బిళ్ల పాటలు పాడుతూ ఊరంతా సందడే సందడి. మీరే చూస్తారుగా.సంగీతక్క కూడా పెళ్లయ్యేదాకా గొబ్బిళ్లు పెట్టి ఎన్ని పూజలు చేసేదని? అసలు మన తెలుగుదనమంతా ఈ సంక్రాంతిలోనే వుంది తెలుసా?'

'కనుము అంటే పశువుపండగేగాని మనకి కాదన్నమాట.'

శర్మ నవ్వాడు.'ఎందుకుకాదు...కనుమునాడు మినుము తినాలని మీ బామ్మ గారెలు చేస్తుంది. ఆవడలు చేస్తుంది.'

'అబ్బా ఇపుడే నోరూరిపోతోంది బామ్మా...' రిత్విక్ నోట్లోకి నిజంగానే నీళ్లూరాయి.

'తిందువుగానిలేరా నాన్నా...కనుము దాకా ఎందుకు...నీకెపుడు కావాలంటే అపుడే చిటికెలో చేసిపెట్టనూ...'

' హమ్మయ్యోయ్ ఓసారి మీ బామ్మ మీరు రాకముందు నామీద పిజ్జాప్రయోగాలు చేసింది లెండి." అంటున్న తాతగారిని చూసి నవ్వారు పిల్లలిద్దరూ.

'అబ్బా అవన్నీ చెప్పడం ఇప్పుడవసరమా అంట?' బామ్మ ఉడుక్కుంటూంటే ముక్కు ఎర్రబడిపోయి తెగ తమాషాగా ఉంది పిల్లలకి.షణ్ముఖశర్మ మాట మార్చేసారు.'అన్నట్టు మర్చిపోయామర్రోయ్...కనుము పండగనాడు ఆడవాళ్లు తమ పుట్టింటి క్షేమం కోరుతూ ఒక వ్రతం చేస్తారు. దాని గురించి నీమనవలికి చెప్పు సుభద్రా!'

సుభద్రకి హుషారొచ్చింది.'అవున్రా...దీన్నే 'కాకికి పిడచలు పెట్టడం ' అంటాం. ముందురోజు రాత్రి అన్నం ఎక్కువగా వండుతాం. కనుమునాడు ఉదయమే లేచి ఆ అన్నంలో విడివిడిగా పసుపు, కుంకుమ కలుపుతాం.కాస్త భాగాన్ని అలాగే ఉంచుతాం. ఈ అన్నాన్ని డాబాలమీదకి తీసుకు పోయి అక్కడ ఒక ఆకులో మూడుభాగాల అన్నాన్నీ మూడు ముద్దలుగా పెడతాం కాకుల వచ్చి వాటిని తిని పోతాయన్నమాట.' అంది వివరంగా.

'అంటే పక్షులకు తిండి పెట్టడమన్నమాట.' చక్కగా విశ్లేషించిన మనవరాలు ఎంతో అపురూపంగా అనిపించింది

షణ్ముఖశర్మగారికి.

'అవునురా బంగారూ......ఇంట్లోకి వచ్చాక దీపస్థంభాలను పూలూ, గంధం, పసుపుకుంకుమలతో అలంకరించి దీపాలు పెట్టి పుట్టింటి క్షేమం, సమృద్ధిని కోరుతూ చుట్టు తిరుగుతూ పాటలు పాడతాం.' సుభద్రలో ఉత్సాహం పెరిగిపోయింది.

మిథున తల్లిని తలచుకుంది.'చిన్నప్పటినుంచి పెరిగిన ఇల్లంటే ఎవరికైనా ప్రేమేకదూ బామ్మా...మా అమ్మ కూడా అమ్మమ్మనూ మావయ్యలను ఎప్పుడూ తలుచుకుంటూనే ఉంటుంది.'

'అవునమ్మా...ఎన్నేళ్లొచ్చినా ఆడవాళ్లకి పుట్టిల్లంటే ఎంత మమకారమో!'

'బామ్మా...తాతయ్యా అదిగో గుడికొచ్చేసాం.అబ్బ ఎంత అందంగా ఉందో ఈ రంగుల రంగవల్లి!'

శర్మగారు మనవడి చేతికి చిల్లర ఇచ్చాడు.' చిన్నా ఈ డబ్బులు తీసుకెళ్లి దేవుడికి ఇవ్వడానికి అదిగో ఆ కొట్టుదగ్గర అరటిపళ్లు, కొబ్బరికాయ కొనుక్కుని పట్రా.'

'ఎందుకూ?ఆయనే మనకిస్తాడుకదా.మనందేవుడికేం ఇవ్వగలం తాతయ్యా!" మనవరాలి మాటల్లోని అంతరార్థం ఆయన మనసుని తాకింది.

సుభద్ర ప్రేమగా మనవరాలి చెయ్యి పట్టుకుంది.'దేవుడి దగ్గరకి, వృద్ధుల దగ్గరకి, పసివాళ్ల దగ్గరకి గర్భిణీల దగ్గరకి, రోగుల దగ్గరకి వెళ్లేటప్పుడు ఉత్తి చేతులతో వెళ్లకుండా పండో, పువ్వో, తీసుకు వెళ్లడం మన సంప్రదాయమమ్మా... పదండి. కాళ్లు కడుక్కుని గుళ్లోకి వెళ్దాం.'

శర్మ వాళ్లు అడక్కుండానే అక్కడి ధ్వజస్థంభాన్ని రావి చెట్టును చూపిస్తూ 'ఇది ధ్వజస్తంభం చిన్నా! ప్రతి దేవాలయంలోను గర్భగుడికి ఎదురుగా తప్పని సరిగా ఇది ప్రతిష్టించి ఉంటుంది.ఇది అశ్వత్థ వృక్షంఅంటే రావి చెట్టు...దీనిని దర్శించినపుడు **మూలతో బ్రహ్మరూపాయ, మధ్యతో విష్ణురూపిణే, అగ్రత: శివరూపాయ, వృక్ష రాజాయతే నమ:** ఇలా చెప్పి నమస్కరించాలమ్మా. అనండి మీరు కూడా. రావి చెట్టు త్రిమూర్తి స్వరూపమన్నమాట.ఇది వేపచెట్టు. చెట్లని పూజించడం కూడా మన సంప్రదాయమే. అర్థమయిందా?'

మిథున ఆలోచించింది.'ఊ... బామ్మా...అసలు ఏ చెట్టు అయినా మనుషులు జీవించడానికి ఎంతో సాయం చేస్తుందిగా. తను మనం విడిచిన కార్బన్ డయాక్సైడ్ తీసుకుని మనకి ఆక్సిజన్ ఇస్తుంది.'

'మంచిమాటన్నావు తల్లీ...ఈమాత్రం జ్ఞానం లేక పట్టణాల్లో చెట్లను నరికేసి ఇళ్లు కట్టేస్తున్నారు.మరి రోగాలు పెరిగిపోయాయంటే పెరిగిపోవా?'

గర్భగుడి దగ్గరకు వచ్చాక పూజారిగారికి నమస్కరించారు షణ్ముఖశర్మ సుభద్ర.'నమస్కారం పంతులుగారూ!'

'నమస్కారం శర్మగారూ!ఏమిటి ఇలా దయచేసారు? మీ చిన్నబ్బాయి పిల్లలా?హిమాలయాల్లో ఉంటున్నారుకదూ! ఎప్పుడొచ్చారేమిటి?'

పిల్లలు ఇద్దరూ కూడా 'నిన్ననే వచ్చాం.నమస్కారం తాతయ్యగారూ!'అంటూంటే 'దీర్ఘాయుష్మాన్ భవ...' అని ఆశీర్వదించాడాయన.'మామనవలికి మన ఆచారవ్యవహారాలంటే మహా యిష్టమనుకోండి పంతులుగారూ!వీళ్లపేర అర్చన చెయ్యండి.' సుభద్ర మురిపెంగా అంది.

పూజారి నవ్వుతూ 'నీపేరేంటిరా బాబూ...' అడిగాడు.

'రిత్విక్...మాఅక్క పేరు మిథున...గోత్రం హరితస... '

'అబ్బో అబ్బో...తాతగారు మనవలికి అన్నీ నేర్పేసారప్పుడే.ఊ...ఆచమనం చెయ్యండి ' అంటూ చేతిలో ఉద్ధరిణితో నీళ్లు పోసి 'హరితస గోత్రస్య రిత్విక్ మిథున నామధేయస్య....'సంకల్పం చెబుతూ మంత్రాలు చదువుతుంటే శ్రద్ధగా విన్నారు పిల్లలు.

పూజారి పూజ పూర్తయ్యాక ' ఇదిగో పాపా బాబూ...జాగ్రత్తగా అనండి.ప్రదక్షిణం చేసేటపుడు ఇలా అనాలి.

**యానికానిచ పాపాని జన్మాంతర కృతానిచ, తానితాని ప్రణశ్యంతి ప్రదక్షిణ పదేపదే**

**పాపోహం పాపకర్మాహం పాపాత్మా పాప సంభవ, త్రాహిమాం కృపయాదేవ శరణాగత వత్సల**

**అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ, తస్మాత్కారుణ్య భావేన రక్షరక్ష మహేశ్వర॥**'అని చెప్పించారు పిల్లలతో.

'అంటే అర్థం ఏంటి తాతగారూ?'

'మేము జన్మజన్మల్లో చేసిన పాపాలనుండి ఈ ప్రదక్షిణ ద్వారా మమ్మల్ని విముక్తి చెయ్యి స్వామీ!నీవే మాకు శరణు వేరే దిక్కు లేదు...అని భగవంతుడిని కోరుకుంటున్నామన్నమాట.'అన్నారు పూజారి.

శర్మగారు కొనసాగిస్తూ 'అంతేకాదు నాయనా! ప్రదక్షిణానికి ఎంతో విశేషం ఉంది. గణాధిపత్యం కోసం వినాయకుడు, కుమారస్వామి పోటీ పడినప్పుడు పరమేశ్వరుడు 'ఎవరు ముందుగా భూప్రదక్షిణం చేస్తే వాళ్లు గణాధిపతి అవుతారని షరతు పెడతాడు.

కుమారస్వామి వేగంగా నెమలిమీద వెళ్లి అన్ని తీర్థాల్లోను స్నానం చేస్తుంటే తన ఎలుక వాహనం మీద వేగంగా వెళ్లలేక దిగులుగా ఉన్న వినాయకుడికి ఉపాయం తడుతుంది. వెంటనే తల్లిదండ్రులయిన పార్వతీపరమేశ్వరులకు మూడు ప్రదక్షిణాలు చేసేసరికి భూప్రదక్షిణ ఫలితం దక్కి పందెం గెలిచి గణాధిపతి అవుతాడు.' అన్నాడు.

'స్వామివారికి దణ్ణం పెట్టుకున్నారా? ఇదిగో తీర్థం తీసుకోండి.అకాల మృత్యుహరణం సర్వ వ్యాధి నివారణం సర్వ పాప ప్రశమనం స్వామి పాదోదకం పావనం శుభం.చక్కగా చదువుకుని మన తెలుగువారి సంస్కృతీసంప్రదాయాలు అలవరచుకుని దేశ విదేశాలు తిరిగి మన తెలుగువారి ఖ్యాతిని నిలబెట్టి మీ అమ్మానాన్నలకి బామ్మాతాతలకు మంచి పేరు ప్రతిష్టలు తెండి.ఇదిగో స్వామివారి ప్రసాదం.' అంటూ పూజారిగారు ప్రసాదమిచ్చారు అందరికీ.

మిథున అడిగింది.'తాతగారూ...ఇందాక తీర్థంలో తులసాకు వేసారు కదూ... మంచి వాసన వచ్చింది.'

'తులసిమొక్క చాలా పవిత్రమైంది తల్లీ...అందుకే ప్రతి దేవాలయంలోను, ఇంట్లోను కూడా తులసి ఉంటుంది.అంతేకాదు...తులసి 24గంటలూ జీవాధారమైన ప్రాణవాయువును వదులుతూ ఉంటుంది. తులసి వాసన వ్యాపించే చోట ప్రాణికోటి పవిత్రులు నిర్వికారులు అవుతారని శాస్త్రం.అందుకేకదా శర్మగారూ...మన చికిత్సావిధానంలో చరక సంహితలో తులసిని సర్వరోగ నివారిణిగా చెప్పాడు.' పూజారిగారి వివరణను ఎంతో శ్రద్ధగా వింది మిథున.

'తాతగారూ.. మాబామ్మ కూడా పొద్దుటే మాయింట్లో తులసికోట దగ్గర దీపం పెట్టి చుట్టూ తిరుగుతూ **యన్మూలే సర్వ తీర్థాని, యన్మధ్యే సర్వ దేవతా:, యదగ్రే సర్వ వేదాశ్చ, తులసీం త్వాం నమామ్యహమ్॥**'అంటూ పాడింది.'

మిథున గుర్తు తెచ్చుకుంటూ చెప్పడం చూసి పూజారి సంబరంగా 'అబ్బో అబ్బో మీ మనవలు అసాధ్యులు సుభద్రమ్మ గారూ...శుభమస్తు...పండక్కి వీళ్లమ్మానాన్నా వస్తున్నారుగా.' అన్నాడు.

'లేగదూడల్ని వదిలి తల్లీతండ్రీ ఉండగలరా!వాళ్లేకాదు, మా అమ్మాయి అల్లుడు చంటిమనవడు, మా సంగీత మొగుడు ఈ పండక్కి కొత్తల్లుడుకదా అంతా రాత్రికి గూటికి చేరుకుంటారు పంతులుగారూ!అందుకే మా పెద్దాడు కోడలు పొద్దుటే పండగ బట్టలకోసం పట్నం బయలుదేరి వెళ్లారు.'

'అక్కా! ఇవాళ బావగారు వస్తారటకదా! బావగారిని ఎలా ఆటపట్టించాలో ప్లాన్ చేద్దామా?' హుషారుగా అన్నాడు రిత్విక్.

మిథున 'సంగీతక్క పొద్దుటే నా చెవిలో అంతా చెప్పిందిగా.ఇంటికెళ్లాక మనకి అదే పని.' అంది ముసిముసిగా నవ్వుతూ.

'అబ్బో అబ్బో అయితే ఇల్లంతా చిన్నారి బావా మరదళ్ల సరసాల ముచ్చట్లతో సంక్రాంతి సంబరమంతా శర్మగారింట్లోనే ఉంటుందన్న మాట.శుభం.'

మనవల మాటలకు సంక్రాంతి బంతి పువ్వుల్లా విరబూసిన షణ్ముఖశర్మ సుభద్రల ముఖాలు చూస్తూ దీవించారు పూజారిగారు.

+++